
గాంధీ సరోవరానికి
రక్షణ భూములు బదలాయించండి

- రాజ్‌నాథ్‌సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని కేంద్ర మంత్రి అధికారిక నివాసంలో బుధవారం సమావేశమయ్యారు. మూసీ, ఇసా నదుల సంగమ స్థలిలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రికి సిఎం వివరించారు.

ఈ రెండు నదుల సంగమ స్థలిలో గాంధీసర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం చేపడతామని.. ఇందుకు అక్కడ ఉన్న 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కోరారు. జాతీయ సమైక్యత, గాంధేయ విలువలకు సంకేతంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్, ఘాట్లు, శాంతి విగ్రహం మ్యూజియం నిర్మిస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపిలు పోరిక బలరాం నాయక్, కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.వి.నరసింహారెడ్డి, కేంద్ర ప్రాజెక్టులు, పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



అణచివేతపై ధిక్కార పతాక ఐలమ్మ.

అణచివేత.. దమనకాండలపై ఎగురవేసిన ధిక్కార పతాక చాకలి ఐలమ్మ అని రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ గడ్డపై దొరల అహంకారానికి...

నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 80 ఏళ్ల క్రితమే జంగ్ సైరన్ ఊదిన యోధురాలు ఐలమ్మ అని అన్నారు. సమ్మక్క-సారక్క, చాకలి ఐలమ్మల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని సిఎం గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.



ముమ్మరంగా వరద సహాయక చర్యలు

- మంత్రి పొంగులేటి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు బుధవారం నాడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో భారీ వర్షాలతో జరిగిన నష్టం, ఇప్పటివరకు తీసుకున్న సహాయక చర్యలపై ఆయా శాఖల వారీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి సమీక్ష చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల చాలా వరకు ప్రాణ, ఆస్తి నష్టం తగ్గిందని అన్నారు. సహాయక పనులను మరింత వేగవంతం చేయాలని చెప్పారు. ఇప్పటివరకు పరిహారాలను విడుదల చేయకపోతే వాటిని వెంటనే అందజేయాలని అధికారులకు సూచించారు. ఏ ఒక్క బాధితుడు పరిహారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, రోడ్ల మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు రూ.పది కోట్లు, సాధారణ నష్టం జరిగిన జిల్లాలకు రూ.ఐదు కోట్లను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. సహాయక చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని హైదరాబాద్ నుంచి ఆయా విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వరద సహాయానికి సంబంధించి వినియోగించిన నిధులకు యూసీలను కేంద్రానికి అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 13వ తేదీలోగా ఆయా విభాగాల యూసీలను సమర్పించాలని ఆదేశించారు. అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్, పంచాయితీరాజ్, హెల్త్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ తదతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటి సమీక్ష

నిజమైన జర్నలిస్టులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్‌వో జి. మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ విధానం, జర్నలిస్ట్‌ల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ అంశాలపై కార్మిక, ఆరోగ్య, హెూం, ఆర్థికశాఖ అధికారులతో త్వరలో మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.



ఒక్క రోజులోనే పది లక్షల ఉత్పత్తుల డెలివరీ

- అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు

హైదరాబాద్ : ఇ-కామర్స్ దిగ్గజం సెప్టెంబర్ 23 నుంచి ప్రారంభించనున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025లో ప్రైమ్ వినియోగదారులకు అత్యంత వేగంగా డెలివరీలను అందించడానికి ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ తెలిపింది. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అమెజాన్ ఇండియా కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ జీబా ఖాన్ మాట్లాడుతూ.. ప్రైమ్ మెంబర్లకు అదే రోజు పది లక్షల ఉత్పత్తులను డెలివరీ చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. 1.5 లక్షల సీజనల్ ఉద్యోగాలను సృష్టించామన్నారు. ప్రైమ్ సభ్యులకు 24 గంటల ముందే కొనుగోళ్లకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. తెలంగాణ నుండి 57,000 మందికి పైగా విక్రేతలు మొబైల్ ఫోన్లు, వినియోగదారు ఎలక్ట్రానిక్స్, బ్యూటీ, కిచెన్ తదితర శ్రేణీ ఉత్పత్తులను అందుబాటులో ఉంచుతున్నారన్నారు. 18,000 మందికి పైగా స్థానిక దుకాణాలు హెూం, కిచెన్, ఫర్నిచర్ శ్రేణుల్లో ఉత్పత్తులను విక్రయించనున్నారన్నారు.

ఫీజులు, పరీక్షలకు ఎఫ్‌ఆర్‌ఎస్‌తో అనుసంధానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూం

రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల పరిధిలోని అన్ని కాలేజీల్లోనూ ఫేషియల్ రికగ్నిషన్ హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్) విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులు, అధ్యాపకులతోపాటు బోధనేతర సిబ్బందికి ఈ విధానం అమలు కానుంది. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో సమావేశం జరగనుంది.

నేటి నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- మఖ్దూం మొహినుద్దీన్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి ఈ నెల 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల ప్రారంభ సూచికగా గురువారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న మఖ్దూం మొహినోయుద్దీన్ విగ్రహం వద్ద నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలతో పురుషులు, మహిళ ప్రదర్శన ఉంటుందని ప్రకటించారు. ఆ తర్వాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కేంద్రాల్లో ఉత్సవాలు జరుగుతాయనీ, 17న ముగింపు ఉత్సవాలను హైదరాబాద్‌లోని రావి నారాయణ ఆడిటోరియంలో నిర్వహిస్తామని వెల్లడించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎలాంటి పాత్ర, చరిత్ర లేని బీజేపీ నేడు ఆ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నదని విమర్శించారు. బిజెపి చేస్తున్న దుష్టపన్నాగాలను ఎండగడుతూ సాధ్యమైన మేరకు ఎక్కువ చోట్ల సభలు, సదస్సులు, సెమినార్లను తమ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. నిజాం రాచరిక, భూస్వామ్య వ్యవస్థల కబంధహస్తాల నుంచి విముక్తి కల్పించేందుకు ఆనాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో మట్టి మనుషులు చేసిన మహత్తర పోరాటం ప్రపంచ చరిత్రలోనే విశిష్టమైనదని వివరించారు. ఆ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. వారోత్సవాల సందర్భంగా నాటి ఘన చరిత్రను మననం చేసుకోని స్ఫూర్తి పొందడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని సాంబశివరావు పేర్కొన్నారు.

విప్లవ నిప్పు కణిక ఐలమ్మ

- మంత్రి ధనసరి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరవనిత చిట్యాల ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో బుధవారం ఆమె చిత్ర పటానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చిట్యాల ఐలమ్మ తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిదర్శనమని చెప్పారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన విప్లవ నిప్పు కణిక ఐలమ్మగా అభివర్ణించారు. భూమి కోసం, భుక్తి కోసం నిజాంపై తిరుగుబాటు చేశారన్నారు. ఐలమ్మ పోరాటాలను, త్యాగాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నట్టు చెప్పారు.

ఎంఎన్‌జె కేన్సర్ ఇన్‌స్టిట్యూట్, రీజినల్ కేన్సర్ సెంటర్

- ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా జోసఫ్ బెంజమిన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంఎన్‌జె కేన్సర్ ఇన్‌స్టిట్యూట్, రీజినల్‌కేన్సర్ సెంటర్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా రేడియోథెరపీ ప్రొఫెసర్ డాక్టర్ జోసఫ్ బెంజమిన్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ వైద్యుల సంక్షేమం కోసం ధైర్యవంతమైన, చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు తెలంగాణ వైద్యుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎం.కె. రవూఫ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పదవిని తెలంగాణ వైద్యునికి కేటాయిస్తూ మంత్రి తీసుకున్న నిర్ణయం వైద్యవర్గానికి అపారగౌరవాన్ని, ఊరటను కలిగించిందని తెలిపారు.



కాంగ్రెస్ అహంకారానికి ఓటుతో బుద్ధి చెప్పండి

- కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే మీ ఇండ్లను కూలగొట్టమని లైసెన్స్ ఇచ్చినట్టే అవుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. కాంగ్రెస్ అహంకారానికి ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన సూచించారు. తమకు ఓటు వెయ్యకపోతే సంక్షేమ పథకాలను ఆపేస్తామంటూ కాంగ్రెస్ బెదిరిస్తోందని ఆరోపించారు. హైడ్రా పేరుతో బిల్డర్లను బెదిరిస్తూ కాంగ్రెస్ నేతలు కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూలగొట్టడమేనని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి బిజెపి ముఖ్యమంత్రి అనీ, ప్రధానమంత్రి మోడీ కనుసన్నల్లో పనిచేస్తున్న నిజాన్ని మైనార్టీలు తెలుసుకోవాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో బిల్డర్ల దగ్గర దోచుకున్న అవినీతి సొమ్మును ఉప ఎన్నికలో పంచి గెలవడానికి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఒక్క మంచి పని చేయని రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, తమ అసమర్థతను అప్పులపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు తీవ్రంగా ద్వేషిస్తున్నారన్నారు. ఇటీవల గణేష్ నిమజ్జనానికి వెళ్లిన సిఎం రేవంత్‌ను ప్రజలు ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రభుత్వంతో ప్రజలు డిస్‌కనెక్ట్ అయ్యారనడానికి అదే నిదర్శనమన్నారు. డబ్బున్న పెద్దల జోలికి హైడ్రా పోవడం లేదనీ, దుర్గం చెరువులో అక్రమంగా ఇల్లు కట్టుకున్న సిఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇంటిని కూల్చే దమ్ముందా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ వ్యతిరేకించే బిజెపి, మోడీ, సిబిఐ లాంటి అంశాల్లో కాంగ్రెస్ భావజాలానికి వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బిజెపికి వేసినట్టేనని చెప్పారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్, గతంలో బిఆర్ఎస్ అమలు చేసిన కార్యక్రమాలను కూడా రద్దు చేశారని తెలిపారు.

టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేయాలి

- గ్రూప్-1 అవకతవకలపై విచారణ చేపట్టాలి
- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతల డిమాండ్
- సుందరయ్య పార్క్ వద్ద నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-1 పరీక్షల అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, వివాదాలకు నిలయంగా ఉన్న టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు, కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలోనే టిజిపిఎస్‌సి చేసిన తప్పిదాల వల్ల రెండుసార్లు గ్రూప్-1 పరీక్ష ప్రిలిమ్స్ రద్దయిందని గుర్తు చేశారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష హాల్ టికెట్ల దగ్గర నుంచి మూల్యాంకనం వరకు వరుస వివాదాలకు టిజిపిఎస్‌సి కేంద్ర బిందువు అయిందన్నారు. నిరుద్యోగ యువత లక్షలాది రూపాయలు కోచింగ్ సెంటర్లలో వెచ్చించి శిక్షణ పొంది పరీక్షలకు హాజరవుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో పారదర్శకంగా నియామకాలు చేపట్టాల్సిన టిజిపిఎస్‌సి.. వివాదాలు సృష్టించేలా వ్యవహరిస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు.

టిజిపిఎస్‌సిని యుపిఎస్‌సి తరహాలో తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ సర్కార్ వరుస తప్పిదాలతో లక్షలాదిమంది నిరుద్యోగ యువతను మోసం చేస్తోందన్నారు. పరీక్ష నిర్వహించినప్పటి నుంచి అనేక అనుమానాలకు తావిచ్చిన టిజిపిఎస్‌సిపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించలేదన్నారు. పరీక్ష పత్రాలను నిపుణులైన ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించాలన్నారు. తెలుగు మీడియం పేపర్లను తెలుగు మీడియం వారితోనే చేయించాలని, ఇంగ్లీష్ మీడియం పేపర్లను ఇంగ్లీష్ మీడియంకు సంబంధించిన నిపుణులతో మూల్యాంకనం చేయించాలన్న నిబంధనలున్నా వాటికి పాతరేస్తున్నారని విమర్శించారు. గ్రూప్-1 పరీక్షల అవకతవకలపై ప్రభుత్వం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సబ్జెక్టు నిపుణులతోనే జవాబుపత్రాల మూల్యాంకనం చేపట్టాలన్నారు. గ్రూప్-1 పోస్టుల భర్తీకి అడ్డంకులు లేకుండా పారదర్శకంగా నియామకాలు చేపట్టేలా మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరారు. టిజిపిఎస్‌సిని ప్రక్షాళన చేసి అందులో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేవరకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు డి.కిరణ్ కె.అశోక్‌రెడ్డి, ఎమ్‌డి జావీద్, శంకర్, మమత, ప్రశాంత్, రమేష్, రాజయ్య, విజయ్ కుమార్, లెనిన్, స్టాలిన్, నాగేందర్, శంకర్, సహన తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లు లక్ష్మి

చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో పోరాడుదాం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో పోరాడుదామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఐలమ్మ 40వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి మల్లు లక్ష్మి, ఐద్వా సహాయ కార్యదర్శి కేఎన్‌ఆశాలత పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు గడప దాటని ఆ కాలంలోనే భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. తాను కౌలుకు తీసుకున్న పొలంలోని పంటను దొర దోచుకోవడాన్ని నిరసిస్తూ ఆ నాటి సంఘం దళ నాయకులైన భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, మల్లు స్వరాజ్యం వంటి నాయకుల సహకారంతో ఐలమ్మ పోరాడిందనీ, దొరను ఎదిరించి పంటను ఇంటికి చేర్చుకున్నారని గుర్తుచేశారు. సాయుధపోరాటంలో ఆరుట్ల కమలాదేవి, పద్మ, మల్లు స్వరాజ్యం, దొడ్డి కొమరయ్య వంటి ఎందరో కమ్యూనిస్టులు పాల్గొన్నారనీ, నాలుగు వేల మంది ప్రాణ త్యాగాలు చేసి పది లక్షల ఎకరాలను పేదలకు పంచారని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా మూడు వేల గ్రామాలకు విముక్తి కల్పించారని చెప్పారు. ఆ పోరాటంతో సంబంధం లేని నేటి బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకులు ఆ పోరాటాన్ని వక్రీకరించి హిందూ ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరిస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నాటి తెలంగాణ సాయుధ రహితంగా పోరాట స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల రక్షణ కోసం ఇల్లు, ఇళ్ల స్థలాల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం స్వర్ణలత, నాయకురాలు సత్యమ్మ, మస్తాన్ బి తదితరులు పాల్గొన్నారు.



సోరెన్‌ను పరామర్శిస్తున్న భట్టి

హేమంత్ సోరెన్‌కు భట్టి పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జార్ఖండ్ పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. ఝార్ఖడ్ ముక్తి మోర్చా (జెఎంఎం) వ్యవస్థాపకులు, మాజీ సిఎం శిబూ సోరెన్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శిబూసోరెన్ మృతి పట్ల భట్టి తన సంతాపాన్ని ప్రకటించారు. బుధవారం జార్ఖండ్‌లోని ఆయన నివాసానికి వెళ్లారు. తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఇరువురు చర్చించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా భట్టి అక్కడ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హేమంత్ సోరెన్‌తో కలిసి పని చేశారు. జెఎంఎం, కాంగ్రెస్ కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో భట్టి విక్రమార్క కీలక భూమిక పోషించారు.

పిడుగుపాటుకు రైతు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్

పిడుగుపాటుకు భద్రాది కొత్తగూడెం జిల్లా గుండాల మండలం చీమలగూడెం గ్రామానికి చెందిన పాయం నర్సయ్య (50) మృతిచెందారు. మంగళవారం తన మొక్కజొన్న చేను వద్ద ఉన్న సమయంలో అతనికి సమీపంలో పిడుగుపడడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. ఉదయం చేను పనికి వెళ్లిన వ్యక్తి రాత్రికి కూడా ఇంటికి రాకపోవడంతో పొలం వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులకు విగతజీవిగా నర్సయ్య కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గుండాల ఎస్ఐ సైదా రావూఫ్ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో నానమ్మ, మనవరాలు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా కేంద్రంలో నానమ్మ, మనవరాలు అనామానాస్పద స్థితిలో మృతిచెందారు. ఈ ఘటన బుధవారం వెలుగుచూసింది. జిల్లా కేంద్రంలోని గోపాల్ వాడలో నివాసం ఉంటున్న బెజ్జం సత్యవతి (54), ఆమె మనవరాలు గీత శిరీష (4) అకస్మాత్తుగా మృతిచెందడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యవతి భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నారు. ఆమె కొడుకు గంగోత్రి ఖమ్మం జిల్లాలో తహసీల్దార్ ఆఫీస్‌లో ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. కొన్ని రోజులుగా భార్య సృజనతో విభేధాలు ఏర్పడటంతో రెండ్రోజుల కిందట తన కుమార్తె గీత శిరీషను తీసుకొచ్చి మంచిర్యాలలో తన తల్లి వద్ద వదిలి వెళ్లారు. నానమ్మ, మనవరాలు ఇద్దరూ రెండ్రోజులుగా ఇంట్లోనే ఉన్నారు. బుధవారం ఉదయం ఇంటి పక్కనవారు ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూశారు. ఇద్దరూ బెడ్‌రూమ్‌లో విగత జీవులుగా కన్పించారు. వెంటనే పోలీసులకు చెప్పారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి కొడుకు గంగోత్రికి సమాచారం అందించారు. మృతికి గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు.

ఈ నెల 13న లోక్ అదాలత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేషనల్ లోక్ అదాలత్‌ను సెప్టెంబర్ 13న నిర్వహించనున్నట్టు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సిహెచ్.పంచాక్షరి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ పెండింగ్ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునేందుకు ఉద్దేశించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నేషనల్ లోక్ అదాలత్‌ను వ్యక్తిగతంగా హాజరై కానీ, వర్చువల్ పద్ధతిలో కానీ ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ప్రజలు జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా కోర్టు ప్రాంగణాల్లోని న్యాయ సేవ సదన్ లేదా మండల లీగల్ సర్వీసెస్ కమిటీలను సంప్రదించాలని సూచించారు.

మేడారం మాస్టర్ ప్లాన్ ఫైనల్ కాలేదు : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీకగా సమక్క-సారలమ్మ తల్లుల త్యాగాల స్ఫూర్తిని ప్రతిబింబించే మేడారం మాస్టర్ ప్లాన్ డిపిఆర్ ఇంకా తుది రూపం దాల్చలేదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. బుధవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దానిపై అనవసర రాద్ధాంతం చేయొద్దనీ, రాజకీయాలు ఆపాదించడం తగదని హితవు పలికారు. ఆదివాసీ సంస్కృతి, సమ్మక్క సారలమ్మ పూజారుల విశ్వాసాలు, లక్షలాది యాత్రికుల మనోభావాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే డిపిఆర్‌ను ఫైనల్ చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి మేడారం పర్యటన అనంతరం మాస్టర్ ప్లాన్‌పై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డిపిఆర్ తయారీలో బయటివారి ప్రమేయం ఉండదని తెలిపారు.

కామారెడ్డి సభను విజయవంతం చేయాలి : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులుగా మహేశ్‌కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 15న కామారెడ్డిలో పార్టీ నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో ఆ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులతో ఇన్‌చార్జి మంత్రి సమావేశమయ్యారు. బీసీల సంక్షేమం కోసం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

- ఆ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాన్‌వెస్లీ, తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని, ఆ వీరోచిత పోరాటంలో చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తి చరిత్రలో చిరస్మరణీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ చెప్పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఇందిరా గార్డెన్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించిన అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడారు. నిజాం నియంతృత్వ, నిరంకుశ, భూస్వామ్య శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా నాడు రైతులు వీరోచితంగా పోరాడారన్నారు. సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా భూమి లేని పేదలకు పది లక్షల ఎకరాల భూమిని పంచిపెట్టారని తెలిపారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటంలో కమ్యూనిస్టులు అగ్రభాగాన నిలిచారన్నారు. నైజాం పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడి తమ ఆస్తిత్వ స్వేచ్ఛను సాధించుకున్న దాంట్లో ఐలమ్మ పాత్ర ప్రముఖంగా నిలిచిందన్నారు. దొరల కింద బానిసలుగా ఉన్నవారే బంధూకులై పోరాడారన్నారు. పల్లె, పల్లెన సంఘం పెట్టి 3 వేల గ్రామాలను నియంతృత్వ దోపిడీ నుంచి విముక్తి కలిగించారన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితో నేడు ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించుకుందామని, ఇందులో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతాంగ సాయుధ పోరాటంతో సంబంధం లేని బిజెపి.. దాన్ని హిందూ ముస్లిం పోరాటంగా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. సాయుధ పోరాటంలో అసలు బిజెపి, ఆర్ఎస్ఎస్ పాల్గొనలేదని, వారి ఆనవాళ్లు కూడా లేవని, కేవలం వారి రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. పది లక్షల ఎకరాల భూమిని పంచింది కమ్యూనిస్టులేనని అన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. గిట్టుబాటు ధరల కోసం పోరాటం చేస్తుంది ఎర్రజెండానే అని చెప్పారు.

భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుకు చిహ్నం 'ఐలమ్మ' : వీరయ్య

భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు.. ఎర్రజెండా చేతపట్టి నిజాం, దేశముఖ్‌లను గడగడలాడించిన వీరవనిత.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది పలికిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్ పోరాటాలు కొనసాగించాలన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో బుధవారం సిపిఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ అధ్యక్షతన చిట్యాల ఐలమ్మ 40వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ.. నియంతృత్వ పాలనపై తిరుగుబాటు చేసిన యోధురాలు ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి వైఖరిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమని చెప్పారు. కానీ, పోరాటానికి సంబంధం లేని బిజెపి, ఆర్ఎస్ఎస్.. మతాల మధ్య ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని, దేశంలో మతకలహాలకు ఆజ్యం పోసేలా యత్నిస్తున్నట్టు తెలిపారు. నిజాంకు వ్యతిరేకంగా 1941నుంచి 1951 వరకు సాగిన ఆ వీరోచిత పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వివిధ సంఘాల నుంచి 500 మంది అంగన్వాడీలు సిఐటియులో చేరారు. వారికి కండువాలు కప్పి సిఐటియులోకి ఆహ్వానించారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, ఎంపి కొండా విశ్వేశ్వరరెడ్డి

ఆరోగ్యకర భోజనానికి 'సంప్రద' చిరునామా

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలోని గచ్చిబౌలిలోని వినాయక నగర్‌లో 'సంప్రద మల్టీక్యూజిన్ రెస్టారెంట్'ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపి కొండా విశ్వేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఆరోగ్యకర భోజనానికి సంప్రద ఒక చిరునామాగా నిలుస్తుందని మంత్రి తుమ్మల అన్నారు. ఈ రెస్టారెంట్ 5000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 220 సీట్లతో అందుబాటులోకి తెచ్చామని.. దక్షిణ భారతీయ, కాంటినెంటల్, చైనీస్ వంటకాలతో ఆరోగ్యకర, రుచికర ఆహారాన్ని అందిస్తుందని ఆ సంస్థ డైరెక్టర్ నాగ భరత్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలుగు సంప్రదాయ రుచులతో హైదరాబాద్ ప్రజల హృదయాలను గెలుచుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టును బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందా?

హరీశ్‌రావుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎల్లంపల్లి ప్రాజెక్టును బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించినట్టు మాజీ మంత్రి హరీశ్‌రావు ఊదరగొడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విమర్శించారు. అసలు ఎల్లంపల్లికి బిఆర్ఎస్‌కు సంబంధమేంటని ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది...దాన్ని పూర్తి చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును ప్రారంభిస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందన్న భయంతో ఇప్పటివరకు అధికారికంగా ప్రారంభోత్సం చేయలేదని విమర్శించారు. దాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేస్తే ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రారంభోత్సవానికి ఇద్దరు ముఖ్యమంత్రులను తీసుకొచ్చిన కెసిఆర్ ఎల్లింపల్లిని ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. 'ప్రారంభించి ఉంటే పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, భూపాలపల్లి, మంచిర్యాలకు ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 2.24 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది' అన్నారు. సింగరేణి విద్యుత్ సంస్థలకు నీటి సరఫరా కూడా ఇక్కడి నుంచే జరుగుతోందని గుర్తు చేశారు. హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలకు ముందు కెటిఆర్ తన నెత్తిన చల్లుకున్న నీళ్లు ఇవే' అని తెలిపారు. ఆనాడు ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేసి కాళేశ్వరాన్ని చేపట్టారని విమర్శించారు. లక్షన్నర కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరాన్ని నిర్మిస్తే బ్యారేజీలు పనికి రాకుండా పోయాయని ఎద్దేవా చేశారు. హరీశ్‌రావు కాళేశ్వరరావు కాదు...ఓ కరప్షన్‌రావు, కలెక్షన్‌రావు అంటూ ఎమ్మెల్సీ కవితనే సర్టిఫికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. సిఎంను విమర్శించే కంటే ముందుగా కవిత అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పాలని హరీశ్‌రావును డిమాండ్ చేశారు.

నేటి తరానికి ఆదర్శప్రాయుడు సురవరం

- తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- నల్లగొండ పట్టణంలో సురవరం సంస్మరణ సభ



సురవరం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించిన ప్రజా ఉద్యమ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నల్లగొండ పట్టణంలోని జిఎల్‌గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. సురవరం చిత్రపటానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నివాళులర్పించారు.

అనంతరం గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితులై ప్రజాపోరాటాల్లోకి దిగారన్నారు. నల్లగొండ ఎంపిగా రెండుసార్లు పని చేశారన్నారు. తామిద్దరం వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేశాము కానీ ఏనాడూ వ్యక్తిగత విమర్శ చేసుకోలేదని గుర్తు చేశారు. ఫ్లోరైడ్ ప్రాంతమైన నల్లగొండ జిల్లాకు సాగు, తాగు నీరు సాధించేందుకు కమ్యూనిస్టులు చేసిన పోరాటంలో తాను ఎప్పుడూ సంఘీభావం తెలిపానన్నారు. ప్రస్తుతం జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని చెప్పారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో కార్మికుల, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో తన తన గళాన్ని విప్పిన గొప్ప కమ్యూనిస్టు మేధావి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఒక్క కామ్రేడ్ వంద మందితో సమానమని, ఒక్కడు ఉన్నా ఎర్రజెండాతో అన్యాయాన్ని ప్రశ్నిస్తారని కొనియాడారు. సురవరం ప్రజలకు చేసిన సేవలను గుర్తిస్తూ జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహం నెలకొల్పడంతోపాటు ఓ మంచి కార్యక్రమానికి పేరు పెట్టేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో ఎన్నో ఉద్యమాలకు నేతృత్వం వహించిన సురవరం సుధాకర్ రెడ్డి ప్రజా ఉద్యమ దిక్సూచి అన్నారు. విద్యార్థి దశ నుంచే ధిక్కార స్వరంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత స్థాయికి చేరారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిస్టు మేధావులలో తెలుగు తేజం సురవరం సుధాకర్‌రెడ్డి ఒకరన్నారు. దేశ ప్రజలు సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలని, దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ఎర్రజెండాలు కలిసి ఐక్య ఉద్యమాలు నడిపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ కమిటీ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస్, పల్లె నరసింహ, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉజ్జిని యాదగిరిరావు పాల్గొన్నారు.

నేపాల్‌లో ఉద్రిక్తతల దృష్ట్యా ప్రత్యేక హెల్ప్‌లైన్

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

నేపాల్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా నేపాల్‌లో చిక్కుకున్న తెలంగాణ పౌరులకు సహాయం చేయనుంది. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు నేపాల్‌లో తెలంగాణ పౌరులెవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకుంటూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. నేపాల్‌లో ఎవరైనా తెలంగాణ వారు చిక్కుకుంటే వారి కుటుంబ సభ్యులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులను ఈ కింది నంబర్ల ద్వారా సంప్రదించవచ్చు. వందన, రెసిడెంట్ కమిషనర్ 9871999044.జి.రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్. 9643723157.సిహెచ్. చక్రవర్తి, ప్రజా సంబంధాల అధికారి 9949351270. తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యులు అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

హెచ్‌సియు విద్యార్థి సంఘాల రద్దు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

- వర్సిటీ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల రద్దు నిర్ణయాన్ని నిరసిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐక్య కార్యాచరణ విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ దేశంలోనే ప్రాధాన్యత కలిగిన యూనివర్సిటీలో ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ఇలాంటి యూనివర్సిటీలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా విద్యార్థి సంఘాలను రద్దు చేయాలని పరిపాలన విభాగం.. ఎబివిపి నాయకులతో కలిసి కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల రద్దు నిర్ణయాన్ని యూనివర్సిటీలో ఎబివిపి తప్ప మిగతా అన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్నాయని తెలిపారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఎబివిపి కుట్రలను బయటపెడతామని హెచ్చరించారు.

సంచార జాతుల సర్వే ద్వారా వాస్తవ పరిస్థితుల అంచనా

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - కల్చరల్

బిసి జనాభా గణన చేసి దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, అలాగే సంచార జాతుల సర్వే ద్వారా వాస్తవ పరిస్థితులు అంచనా వేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై సంచార యుక్త జాతుల దినోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ప్రభుత్వం మంచి తరాలను తయారు చేయటానికి విద్యకు ప్రాధాన్యతనిస్తోందన్నారు. సంచార జాతుల యువత చదువుకుని ఉద్యోగాలు చేయాలని, ఇందుకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమానికి రూ. 400 కోట్లు కేటాయించి రూ. వంద కోట్లు విడుదల చేసిందని తెలిపారు. సంచార జాతుల గృహ నిర్మాణాలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కులవృత్తులను కాలానికి అనుగుణంగా మార్చుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎంపి ఈటల రాజేందర్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, శాసన సభ్యుడు శంకర్, బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాల మయా దేవి ఇతర అధికారులు పాల్గొన్నారు

ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగనివ్వబోం

- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్ 1 విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగనివ్వబోమని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కమిట్‌మెంట్ అని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైకోర్టు తీర్పులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పు పట్టలేదని తెలిపారు. ఎలాంటి అవకతవకలూ జరగలేదన్నారు. లక్ష మందికి ఉద్యోగాలిస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అడ్డగోలు ఆరోపణలు చేస్తే, తాము మాటలతో కాకుండా చేతలతో సమాధానం చెబుతామని హెచ్చరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం టెన్త్, ఇంటర్ పరీక్షలను కూడా సక్కగా నిర్వహించలేదని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల బతుకుల్లో చీకటి నింపిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం వారి జీవితాల్లో భరోసా నింపిందని తెలిపారు. యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో యూరియా సంక్షోభం : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో యూరియా సంక్షోభం నెలకొందని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ సర్కారుకు రైతుల కష్టాలు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ మానేసి యూరియా సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 8 మంది కాంగ్రెస్, 8 మంది బిజెపి ఎంపిలు కేంద్రం పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపును ఉపసంహరించుకునేలా, పత్తిపై ఎత్తేసిన సుంకాన్ని యథావిధిగా కొనసాగించేలా ఒత్తిడి చేయాలని కోరారు. రైతుల నిరసనలు, ధర్నాలు చేస్తూ, నడిరోడ్లపై బారులు తీరుతూ, క్యూలో నిలబడుతూ, ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికి కాంగ్రెస్ వైఫల్యమే కారణమని ఆరోపించారు. 22 నెలల్లో రైతులను నడిరోడ్డుపైకి ఈడ్చిన దుర్మార్గ పాలనలో యూరియా అడిగితే చెంపలు చెల్లుమనిపిస్తున్న ప్రజాపాలన అని ఆయన ఎద్దేవా చేశారు. యూరియా తెప్పించడంలో, సరఫరా చేయడంలో కాంగ్రెస్ సర్కార్ ముందుస్తు ప్రణాళిక లేకపోవడమే రైతుల సమస్యలకు కారణమని తెలిపారు. రెండు నెలలుగా కాంగ్రెస్ మొద్దు నిద్ర నటిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపి ఎంపిలు ఉండి ఏం లాభం? అని హరీశ్ రావు ప్రశ్నించారు. పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 10 శాతానికి తగ్గించి, అమెరికా నుంచి దిగుమతయ్యే పత్తిపై సుంకాన్ని ఎత్తివేయడంతో మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టైందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో రైతులకు కంటి నిండా నిద్రపోని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న సప్రే

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

- సుప్రీంకోర్టు రోడ్ భద్రతా కమిటీ చైర్మన్ అభయ్ మనోహర్ సప్రే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సుప్రీంకోర్టు రోడ్ భద్రతా కమిటీ చైర్మన్ అభయ్ మనోహర్ సప్రే అన్నారు. బుధవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులతో రోడ్ సేఫ్టీపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, మరణాల పెరుగుదలను అరికట్టేందుకు ఏర్పాటైన కమిటీ, రోడ్డు భద్రతా చట్టాల అమలుపై పర్యవేక్షణ చేస్తూ, రాష్ట్ర విధానాలను సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల సామాజిక, ఆర్థిక ప్రభావం నేపథ్యంలో సుప్రీంకోర్టు జోక్యంతో కమిటీ ఏర్పాటైన విషయాన్ని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా రోజుకు 500 మంది, గంటకు 25 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని చెప్పారు. గణాంకాలను ప్రస్తావిస్తూ, 'ప్రమాదాలు దేవుడి చిత్తం కాదు, అవి నివారించగలిగేవి, తప్పించుకోగలిగేవి' అని వ్యాఖ్యానించారు. మరణాలను తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపట్టిన చర్యలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వివరించారు. తెలంగాణ రోడ్డు భద్రత పట్ల తీసుకుంటున్న చర్యలను హోంకార్యదర్శి రవిగుప్తా వివరించారు. ట్రాఫిక్ నియంత్రణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వాడకాన్ని డిజిపి డాక్టర్ జితేందర్ వివరించారు. వాహనాల రిజిస్ట్రేషన్లు, ప్రమాదాలు, మరణాలు, గాయాలు తదితర వివరాలను ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్ర మోహన్ వివరించారు. పాఠశాల్లో రోడ్డు భద్రతా పాఠ్యాంశాలను చేర్చుతున్నట్టు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితా రాణా తెలిపారు. తెలంగాణలో చేపట్టిన చర్యలపై సంతృప్తి వ్యక్తం చేసిన చైర్మన్ సప్రే... భవిష్యత్తులో వ్యక్తిగతంగా సందర్శించి అమలు స్థితిని పరిశీలించారు. ఉత్తమ పద్ధతులను ఇతర రాష్ట్రాలతో పంచుకోవాలనుకుంటున్నట్టు తెలిపారు.

పేపర్‌పై 18 శాతం జిఎస్‌టి అనుచితం

తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం కాగితంపై 18 శాతం వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వేసిందని.. ఇది అనుచితమని తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అభిషేక్ విజయవార్జీ అన్నారు. పేపర్ విలాస వస్తువు కాదని.. ఇది అత్యవసర వస్తువని ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ప్రచురణకర్తలు, ప్రింటర్లు, ప్యాకేజింగ్ పరిశ్రమ సహా సమాజంలో ఎంతో మంది ప్రతిరోజూ ఉపయోగించే ఒక అత్యవసర వస్తువు కాగితం అన్నారు. దీనిపై ఇటీవల జిఎస్‌టిని 18 శాతానికి పెంచడం వల్ల విద్య, సంబంధిత పరిశ్రమలపై అధిక భారం పడుతుందన్నారు. కాగితం కేజీ రూ.70, జిఎస్‌టి ఐదు శాతం కలిపితే రూ.73.50 అవుతుందన్నారు. అదే 18 శాతం జిఎస్‌టి అయితే రూ.82.60 అవుతుందన్నారు. కిలోపై అదనంగా 12 శాతం భారం పడనుందన్నారు. నూతన జిఎస్‌టితో నోటుబుక్స్, పాఠ్య పుస్తకాలు, పరీక్ష పత్రాలు, ప్యాకేజింగ్, రోజువారీ ఉత్పత్తులపై అనేక రెట్లు పెరుగుతుందని చెప్పారు. దేశంలో కాగితం పరిశ్రమ అడవులను నరకడం లేదన్నారు. సొంతంగా చెట్లను సాగు చేస్తుందన్నారు. కాగితంపై జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు.

సిఆర్‌టిలకు వేతనాలు చెల్లించాలి : డిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లకు బకాయిపడ్డ గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలకు ఆరు నెలలుగా గౌరవ వేతనాలు ఇవ్వట్లేదని వాపోయారు. వెంటనే వారికి వేతనాలు విడుదల చేయాలని కోరారు.